# 17. హత్య

విచారంతో దీర్ఘాలోచనామగ్నుడనై పడక కుర్చీలో కూర్చున్న నేను "హలో రామం" అంటూ వచ్చిన విశ్వం పిలుపుతో ఈ లోకంలో పడ్డాను. "ఏంట్రా ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్?" అంటూ నా కెదురుగా కూర్చున్నాడు విశ్వం. ఏం లేదు, నా కన్యాయం జరిగిందనికాదు గాని మనుషుల గడ్డితినే స్వభావాన్ని గూర్చి చింతిస్తున్నా" నన్నాడు

గడ్డి తినడం ఇపుడు మనుషులే చేస్తున్నారు. సరే ఇంకా నీవా విషయం మర్చిపోలేదా?" అని "ఆ ప్రమోషన్ నీకే రావాలని ఆశించడానికి నీకున్న అర్హతలేంటి? అన్నాడు.

"సీనియారిటీ, మెరిట్, ఉన్నవాళ్లలో మెరుగ్గా ఇంటర్వ్యూ చేయడం, సిన్సియర్‌గా వర్కుచేయడం, పనిచేస్తున్న సంస్థ స్వంతమనుకొని పనిచేయడం" అన్నాను.

"ఇంతేనా యింకేమైనా ఉన్నాయా?" అన్నాడు.

"ఇంకా వేరే అర్హతలు కావాలా?" అన్నాను.

నా మాటలకు ఫక్కున నవ్వాడు విశ్వం.

రామం! నువ్వెంత అమాయకుడివి? ఈ అర్హతలుంటేనే ఈ కర్మభూమిలో ప్రమోషన్ వస్తుందనుకుంటున్నావా? ప్రమోషన్ కొరకై ఇందులోని ఏ ఒక్క అర్హతా సరిపోదు. ఇందులో ఏ ఒక్కటీ లేకున్నా వస్తుంది నేనడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పు- నీకెందుకు ప్రమోషన్ రాలేదో చెబుతాను" అని "నీకీ సంస్థలో పైలెవెల్‌లో నిన్ను కాపాడుటానికి

ఏ అర్హత లేకున్నా పైకి లాగటానికి "గాడ్ ఫాదర్" లాంటి పెద్దమనిషెవరైనా ఉన్నారా?" "నేనొచ్చింది సామాన్య నిరక్షరాస్య కుటుంబంనుంచి. నాకలాంటివాళ్ళెలాఉంటారు?

"పోనీ నువ్వు దాదాగిరి లాంటిది చేసి బెదిరించి పనేం చేయకున్నా ఇన్‌ఫ్లూయెన్స్ చేయించుకోగలవా?"

"నా పనేందో నేనేకాని, నాకలాంటివి చేతకావు."

"ఇవేవీ లేకున్నా పై ఆఫీసర్ల మీద ఊంచినా 'ఓకే సర్' మహాభాగ్యమంటూ తుడుచుకొని వాళ్ళ మూతులు నాక్కుంటూ ఉండే చంచాగిరైనా నీకు సాధ్యమవుతుందా?"

"ముమ్మాటికీ కాదు. తప్పును తప్పనడం నా నైజం"

"పోనీ నీవెనుక ఏదైనా పెద్ద ఆర్గనైజేషన్ ఉందా? పై వాళ్ళను ఇన్‌ఫ్లూయెన్స్ చేయడానికి?"

"అలాంటిదేంలేదు. ఒకవేళ ఉన్నా నా స్వంతానికై దాన్నుపయోగించుకోవడం నీచంగా భావిస్తాను."

"దెన్ యు గో టు హెల్. నీ ప్రిన్సుపుల్స్ సిద్ధాంతాలెవడిక్కావాలి? నీకెన్ని అర్హతలున్నా పై నాలుగిట్లో ఏ ఒకటి లేకుండా స్వంత ప్రతిభతో పైకి పోవాలనుకోవడం నీ తెలివి తక్కువతనం" అన్నాడు.

"ప్రమోషన్ పోనివ్వు కాని నాకింత ద్రోహం చేయడానికి నేను కృష్ణచైతన్యగాడికి చేసిన నష్టమేంటో నాకర్థంకావడం లేదు" అన్నాను.

—కాలువ మల్లయ్య

"పిచ్చోడా వాడికి నువ్వు నష్టం చేయాల్సిన అవసరం లేదు. వాడన్నదానికల్లా జీహుజూర్ అనకపోవడం, వ్యక్తిత్వము కలిగియుండటమే నీవు చేసిన ద్రోహం. పామెందుకు విషం కక్కుతుంది? తేలెందుకు కుడుతుంది? కొందరు మనుషులకు నిలువెల్లా విషముంటుంది. కృష్ణచైతన్యగాంటి సాడిస్టు మెంటాలిటీ. ఇతరులు విచారంగా ఉంటే సంతోషించడం వాని నైజం. క్రూర మృగంగా హింసతో ఆనందమనుభవించడం వాని జీన్స్‌లో ఉన్న గుణం."

నాకు తెలిసినంతవరకు విషపురుగులుకూడా తమకు నష్టం జరుగుతుందనుకున్నపుడే కరుస్తాయి. కాని ఈ మనుషులే...." అంటుండగానే- "అవును కొందరు మనుషులు మృగాలకంటె కడుహీనం. ఇలాంటిమనుషులగురించిభర్తృహరి ఒక శ్లోకంచెప్పాడు జ్ఞాపకముందా?

పరులకొరకు తన కార్యాలనువదలి సాయంచేసేవాడు ఉత్తముడు. తన పనులు చేసుకుంటూ పరుల కార్యాలుచేసేవాడు మధ్యముడు. తనకొరకు ఇతరులను నష్టపెట్టేవాడు రాక్షసుడు. వృధాగా ఇతరులను నష్టపెట్టేవాన్నేమనాలో అతనికే తెలియలేదు. అలాంటి పశువులకు కృష్ణచైతన్య అని పేరు పెట్టాలంటాను" అన్నాడు విశ్వం

"చాలా బాగాచెప్పావు కాని ఒక పద్ధతంటూ లేకుండా అర్హతలు చూడకుండా అన్యాయంచేస్తూపోతే పనిచేసేవాడి

కింటురెస్టేలా వుంటుంది? దేశం గతి ఏంకావాలి" అన్నాను.

"లెట్ ది కంట్రీ గో టు హెల్. దేశ మెవడికావాలి? పనెవడికావాలి? బంధు ప్రీతి, ఆశ్రిత పక్షపాతం నరనరాన జీర్ణించుకొని ఉన్న ఈ సమాజంలో దేశమంటే ఎవరికుంది ప్రేమ? అస్మదీయులైతే చాలు. ఏ అర్హతా అవసరంలేదు. పోగా పని- నువ్వుకాదు; నీలాంటి వందమంది పనిచేయకున్నా మునిగిపోయే దేంలేదు. నీదంత ముఖ్యమైన ఉద్యోగమా? బోడి క్లర్కునౌకరి. డిఫెన్సు, హోంశాఖలాంటి కీలకమైన శాఖల్లోనే ఎన్నో అవకతవకలు జరుగుతున్నాయి. వెనుకవాడు ముందుకు, ముందువాడు వెనక్కు నెట్టివేయబడుతున్నారు. తమకు జరిగిన అన్యాయాని కెంతోమంది రిజైన్ చేస్తున్నారు. వాళ్లు దేశానికెంతో ఉపయోగపడేవాళ్ళెయినా ఎవరూ కేర్ చేయడంలేదు. అలాంటప్పుడు నీలాంటి బోడి ఉద్యోగి నడిగేదెవరు? రోజూ పేపర్లో ఎన్ని వార్తలు చదవడంలేదు. ఎంతోమంది మేధావులు తమ ప్రతిభకు గుర్తింపులేక ఎవరో అనామకుల్ని తమపై కూర్చుండబెడితే ఆత్మహత్యలు చేసుకోవడం, రిజైన్ చెయ్యడం, దేశాన్ని వదలిపోవడం చేయడంలేదు. అయినా ఎవరికీ చీమకుట్టినట్టయినా ఉంటుందా?" అన్నాడు.

విశ్వం చెప్పిన విషయాలు ఈ దేశంలో నగ్నసత్యాలని గమనించాను. "మిత్రులతో ప్రమోషన్ కొరకు నానా గడ్డితిం

టుంటే బాధగా వుంది. వాళ్ళకు ప్రమోషన్ వచ్చినందుకు కాదుగాని, వాళ్లు దానికొరకై అవలంబించిన విధానమే బాధాకరంగా వుంది" అన్నాను.

"కొలుపుపెట్టి చెపుతుంటె తలుపుపెట్టి అడిగినట్టుంది నీ కథ. మనిషిలో కరుడుకట్టిన స్వార్థం ప్రవేశిస్తే బంధువులు, మిత్రులు ఎవరూ గుర్తుండరు. ఏ గడ్డితినైనాసరే పైకి పోవాలనుకుంటారు. వీళ్ళన్నా దొడ్డిదారి నెన్నుకున్నారు కాని, ప్రమోషన్ల కొరకు ఎన్నో ఘోరాలుచేసిన దుర్మార్గులున్నారు. కట్టుకున్న భార్య నెరగాచేసికూడా ఈదేశంలో పైకిపోయినవారున్నారు. ఆ మధ్య ఓసారి పేపర్లో వార్త వచ్చింది. నువ్వు చూసేవుంటావు తన ప్రమోషన్ కొరకు కన్నకూతురు శీలాన్ని ఎరగా చూపిన ప్రబుద్ధుడి వృత్తాంతం" అన్నాడు.

"నాకులేక వాళ్ళకున్న అర్హతలేంటి? ప్రమోషన్ రావడానికి" అన్నాను.

"అయ్యో బాబూ! నీకెన్నిసార్లు చెప్పాలి? ఏ అర్హతతో అంజయ్య గద్దెనెక్కిండు? ఏ అర్హతతో భవనం ముఖ్యమంత్రి అయ్యిండ్రు? విధేయత బాబూ విధేయత. ఈదేశంలో తనను పోషించే సంస్థకు విధేయులుగా ఉంటే లాభం నాస్తి. తానెంత ద్రోహి అయినా తనపైనున్న భాసురోత్తముడికి వాడెంత పశువైనా విధేయుడిగా ఉంటే చాలు.

అన్ని అర్హతలున్నట్టే లెక్క. ఇప్పుడర్థమయ్యిందా?" అన్నాడు విశ్వం.

ఇప్పుడంతా అర్థమయ్యింది. కాని ఇంకా అర్థంకాని దొక విషయముంది. ప్రిన్సిపుల్ కే మారుపేరైన మేనేజర్‌గారిని కూడా వీళ్ళిలా బుట్టలో వేసారంటావు? సాధారణంగా అతడు తన ఉద్దేశాలకు తిలోదకాలివ్వడు. అతని కాలంలో చాలావరకు ప్రమోషన్లు న్యాయంగానే వస్తాయంటారు" అన్నాను.

"రామాయణమంతా విని రామునికి సీతేంగావాలన్నట్టుంది నీ కథ. మేనేజర్ నీతిమంతుడే కావచ్చు. న్యాయంగా నడిచేవాడే కావచ్చు. ఇంకా ఒకరిద్దరు మంచివారే కావచ్చు. కాని అతడుండే సమాజం ఎలాంటిది? అది గొంగళిలాంటిది. గొంగట్లో అన్నంతింటూ వెంట్రుకలు రావద్దంటే సాధ్యమవుతుందా? ఒకరిద్దరు మంచివాళ్ళయితే లాభంలేదు. వాళ్ళను తప్పుదార్లు పట్టించడానికి కృష్ణచైతన్యంలాంటి గుంటనక్క లెంతోమందున్నారు సమాజానికి కుక్కమూతి పిందెల్లాంటి కృష్ణచైతన్యంలాంటివాళ్ళు ఎంత నీచానికొడిగట్టయినా కాళ్ళు కడుపులు పట్టుకొనైనా తమ పనులు నెరవేర్చుకుంటూరు. వాళ్ళకు జీవితానికో ధ్యేయమంటూ ఉండదు. పందిలా బ్రతుకడమే వ్యక్తిత్వంగలవాళ్ళకు నష్టం చేయడు" అన్నాడు విశ్వం.

—కొలువ మల్లయ్య

విశ్వం తనకుగల సునిశిత పరిశీలనాశక్తితో నాలో అనేక సందేహాలు తీర్చాడు. చివరగా అడిగాడు "ఇలాచేస్తే ఎలా? అని___

"దేశంలోని వేలాదిమంది ఇలాగే హింసిస్తూ తమ **Saddest mentality** ని తృప్తిపరచుకోవడానికై కృష్ణ చైతన్యం లాంటి పందులు వాళ్ళలోని **Work mindedness** ను, ఉత్సాహాన్ని హత్యచేస్తున్నారు. ఈ సమాజంలో న్యాయం ఆశించడం భ్రమ. ఎలాగో అడ్జెస్టవుతూ బతకాలి" అన్నాడు. నాలో విచారాన్ని పటాపంచలు చేసిన విశ్వంకు కృతజ్ఞతలు చెప్పాను నేను.